సాక్షి నారాయణపేట

శనివారం : 26 ఏప్రిల్ 2025



సహాయక చర్యలకు బ్రేక్

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేసేందుకు అధికారులు నిర్ణయించారు.

వివరాలు IIలో ▸



రైతుల రాస్తారోకో

ధాన్యం కొనుగోలుకు గన్నీ బ్యాగుల కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చేపట్టారు.

వివరాలు IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
41.2 /24.1

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

రీ సర్వే చేయరూ..!

కొడంగల్ - పేట ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్



ఈ ఫొటో ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలోనిది. శుక్రవారం ఆర్డీఓ రాంచందర్ నాయక్ ఊట్కూర్ మండలంలోని బాపూర్ గ్రామ శివారులో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. తాము కోల్పోతున్న భూములకు భూమి చూపించాలని రైతులు కోరారు. కాగా భూమికి భూమి ఇచ్చే పరిస్థితి ఉండదని ఆర్డీఓ తేల్చి చెప్పారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా ఎకరానికి రూ.60 లక్షల మేరకు ఇవ్వాలని, కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో తమ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఈ ప్రాజెక్టులో సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ 2013 భూ చట్టం ప్రకారం భూ నష్టపరిహారం ఏవిధంగా ఇచ్చారో అదేవిధంగా ఇస్తారని, రైతులందరూ సహకరించి ప్రాజెక్టు పనులు వేగిరం అయ్యేలా చూడాలని కోరారు.

- నష్టపరిహారంపై స్పష్టత ఇవ్వకపోవడంపై అనుమానం
- భూమికి భూమి లేదా.. మార్కెట్ రేటు ఇవ్వాలి
- నోటీసులు తీసుకునేందుకు రైతుల వెనుకంజ
- హడావుడి సర్వేతో చిక్కులెన్నో..

నారాయణపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టులో చేపట్టిన భూ సర్వేలో లోపాలున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ.. మరోసారి తమ ముందే రీ సర్వే చేయాలంటూ గోడును వెలిబుచ్చుతున్నారు. ఇది వరకే జిల్లాలోని సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఏర్పాటుచేసిన బృందాలు విడివిడిగా వారికి కేటాయించిన మండలాలు.. గ్రామాల్లో సర్వే చేపట్టి నివేదికలు సమర్పించారు. ఇదిలాఉండగా, మక్తల్ మండలంలోని భూత్పూర్ రిజర్వాయర్ నుంచి దామరగిద్ద మండలంలోని గడిమున్కన్‌పల్లి వరకు 560 ఎకరాలకు ఇరిగేషన్, రెవెన్యూ, సర్వేయర్ల బృందం ఇదివరకే పెగ్‌మార్క్ సర్వేను పూర్తి చేసి నివేదికలను జిల్లా అధికార యంత్రాంగానికి నివేదించింది. ఆ సర్వే వివరాలతో సంబంధిత రైతులకు ఒక్కో గ్రామానికి మండల తహసీల్దార్ల నుంచి నోటీసులను అందజేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

నోటీసులు తీసుకునేందుకు సంకోచం

తమ విలువైన భూములు కోల్పోతున్నామంటూ రైతులు ఆందోళన చెందుతూ రెవెన్యూ అధికారుల నుంచి వస్తున్న నోటీసులను తీసుకునేందుకు ఒకింత ముందు వెనక అవుతున్నారు. భూ సర్వే ఆధారంగా.. రెవెన్యూ రికార్డులో ఉన్నా భూ వివరాలతో సంబంధిత రైతులకు ఇస్తున్న నోటీసులు తీసుకోకపోతే రైతులే నష్టపోతారంటూ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ముందు నోటీసులు తీసుకోవాలని.. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని వివరిస్తున్నారు. కాగా కొంత మంది రైతులు తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మా గోడు పట్టించుకునే వారే లేరంటూ ఆందోళన చెందుతున్నారు. నోటీసులు తీసుకుంటే సరే..లేదంటే ప్రభుత్వ నియమనిబంధనల మేరకు భూ సేకరణ జరుగుతుందని రైతులకు తెలియజేస్తున్నారు.

హడావుడి సర్వేతో చిక్కులెన్నో..

ప్రాజెక్టుకు కావాల్సిన భూ సర్వేను ఆరు నెలల్లో చేయాల్సి ఉండగా.. ఉన్నతాధికారుల ఒత్తిడితో నెల రోజుల్లోనే పూర్తి చేశారు. దీంతోనే చిక్కులొస్తున్నాయంటూ సర్వే పరిశీలకులు, అనుభవజ్ఞులు బహిరంగంగానే వాదనలు వినిపిస్తున్నారు. పెగ్ మార్క్ సర్వేను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి సర్వేయర్లు చేపట్టారు. రైతులకు పూర్తి స్థాయిలో వివరించకుండా ముందుకు సాగుతూ సర్వే చేయడంతో తమ భూములను తమ ముందు రీ సర్వేచేయాలంటూ రైతులు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తున్నాం



పేట - కొడంగల్ ప్రాజెక్టు కింద భూముల పెగ్ సర్వే పూర్తి అయింది. రైతులకు నోటీసులను అందజేస్తున్నాం. అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలిస్తున్నాం. రీ సర్వే కోరిన చోట సర్వేయర్లు, రెవెన్యూ అధికారులను పంపించి సర్వే చేయిస్తున్నాం. రైతులు అందరూ సహకరించి నోటీసులు తీసుకోవాలని సూచిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు భూ నష్టపరిహారం వస్తుంది.

– చింత రవికుమార్, తహసీల్దార్, ఊట్కూర్

ఎకరాకు రూ.60 లక్షలు ఇవ్వాలి



బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి రూ. 60 లక్షలు పలుకుతుంది. ఆ ప్రకారం తమకు భూ నష్టపరిహారం ఇవ్వాలి. తనకున్న నాలుగు ఎకరాల భూమి ఈ ప్రాజెక్టులో పోతుంది. ప్రభుత్వం ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఇస్తే ఎలా. భూమి పోతే భూమి అయినా చూపించాలి. ఈ కాలంలో భూమి పోతే భూమి సంపాదించుకోవడం చాలా కష్టం.

– దాసరి కనకదాసు, రైతు, బాపూర్ గ్రామం, ఊట్కూర్ మండలం

ఇంటికో ఉద్యోగం..



ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయే రైతులకు ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. ఎకరానికి నష్టపరిహారం బహిరంగా మార్కెట్‌లో ఉన్న విలువ ప్రకారం ఇవ్వాలి.

– నర్సింహులు గౌడ్, రైతు బాపూర్, ఊట్కూర్ మండలం

స్పష్టత ఇవ్వడంలేదు..

భూములు కోల్పోతున్న రైతులకు ఎంత పరిహారం ఇస్తారనేది ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదు. అన్ని భూములకు ఒకే ధర ఇస్తామంటే నష్టపోతాం. ఎకరానికి రూ.60 లక్షలు ఇవ్వాలి.

– ఎం.సురేందర్‌రెడ్డి, రైతు, ఊట్కూర్

డీజీపీఎస్ పరికరం ఏమైంది ?

భూ సర్వే చేయడానికి అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించాలని గత కలెక్టర్ కోయ శ్రీహర్ష తన గ్రాంట్ నుంచి డీజీపీఎస్ పరికరాన్ని కొనుగోలు చేయించి గతేడాది మార్చి 15న జిల్లా సర్వేయర్ల అధికారుల బృందానికి అప్పగించారు. కానీ పేట – కొడంగల్ ప్రాజెక్టు సర్వేలో ఇరిగేషన్ అధికారులు డీజీపీఎస్ పరికరాన్ని వాడితే.. సర్వేయర్లు బృందం జీపీఎస్ పరికరంతో సర్వే చేపట్టారు. దీంతో ఇరిగేషన్, సర్వేయర్లు చేపట్టిన సర్వేలో లెక్కలు తేడా ఉందని, హద్దులు సరిగ్గా చూయించలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అసలు ఆ పరికరాన్ని ప్రభుత్వ భూముల సర్వేలో అక్కడక్కడ వినియోగిస్తూ.. ప్రైవేట్ సర్వేలకు ఎక్కువగా వినియోగిస్తున్నరని తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలాఉండగా, భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం సీఎం ఇలాఖాలో ఎంత వస్తుందో.. నారాయణపేట, మక్తల్ నియోజకవర్గంలో రైతులకు అంతే వస్తుందని ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి భరోసానిస్తున్నారు.



డీజీపీఎస్ పరికరాన్ని సర్వేయర్లకు అందజేస్తున్న గత కలెక్టర్ కోయ శ్రీహర్ష (ఫైల్)

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం



దమ్‌గాన్‌పూర్ రెవెన్యూ సదస్సులో రైతుల ఫిర్యాదులపై ఆరా తీస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి రూరల్/మద్దూరు: ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు నూతన భూ భారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కోస్గి, మద్దూరులో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణిలో ఉన్న సమస్యలను తొలగించి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ప్రభుత్వం నూతన చట్టం భూ భారతిని తీసుకువచ్చిందన్నారు. ధరణి పోర్టల్‌లోని 32 అంశాలను తొలగించి 11 అంశాలతో భూ భారతి చట్టంతో భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారికి భూదార్ కార్డును అందజేయనున్నామని అన్నారు. కింది స్థాయి అధికారులు పొరపాట్లు చేస్తే న్యాయం కోసం పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, 99శాతం భూ సమస్యలు తహసీల్దార్ వద్దే పరిష్కారం అవుతాయని, 30 రోజుల్లో మ్యుటేషన్లు పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, తహసీల్దార్లు బక్క శ్రీనివాస్, భాస్కరస్వామి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు భీంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారం

తహసీల్దార్ స్థాయిలోని సమస్యలను మోకా మీదనే పరిష్కరించాలని తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం మద్దూరు మండలంలోని దమ్‌గాన్‌పూర్, నాగిరెడ్డిపల్లిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించారు. రెవెన్యూ సదస్సులను వేగవంతం చేయాలని, సదస్సుల్లో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు ఏ సమస్యలపై ఎక్కువగా వచ్చాయని ఆరా తీశారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు, తదితర అంశాలపై మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి ప్రత్యేకాధికారి యాదగిరి, అడిషన్ కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, భూ భారతి కోసం నియమించిన తహసీల్దార్, ఆర్ఐ, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మద్దూరు మండలంలో తలెత్తిన సమస్యలను వారి పరిష్కారం కోసం చేస్తున్న కసరత్తుపై అధికారులతో ఆమె సుదీర్ఘంగా చర్చించారు.

మలేరియా నిర్మూలనకు కృషి



మలేరియా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ జయచంద్రమోహన్ తదితరులు

నారాయణపేట: మలేరియా నిర్మూలన కోసం ప్రజలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం నుంచి అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన రహదారి గుండా వీర సావర్కార్ చౌరస్తాకు నినాదాలు చేస్తూ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ఆడ ఎనాఫిలిస్ దోమ ద్వార వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి నివారించాలంటే ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే ను పాటించాలని, దోమలు పుట్టకుండా.. కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చన్నారు. అదే విధంగా మలేరియా వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.శైలజా, వైద్యులు నర్సింహారావు, మల్లికార్జున్ డీఎంఅండ్‌హెచ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది బిక్షపతి, గోవిందరాజు శ్రీనివాస్, తబితారాణి, శంకర్, శ్రీధర్, గోవిందారావు, బుగ్గేశ్వర్, బాలశేఖర్, ఎఎన్ఎంలు శివశేశమ్మ, సరస్వతి, పుష్ప, పుష్పలత, రామేశ్వరీ , కరుణమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి ప్రతీకారం తప్పదు



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల టౌన్: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి ప్రతీకారం తప్పదని, ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ మూల్యం చెల్లించక తప్పదని, అది ఎంతో దూరం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి జడ్చర్ల ప్రేమ్‌రంగా గార్డెన్‌లో నిర్వహించిన వన్ నేషన్ వన్ ఎలక్షన్, వక్ఫ్‌బోర్డు చట్టంపై ఏర్పాటు చేసిన మేధావుల సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేశాక కశ్మీర్‌ను మరో స్విట్జర్లాండ్‌గా భావించి పర్యాటక రంగం ఊపందుకుందన్నారు. అనేక రకాలుగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో దేశ, విదేశాల నుంచి పర్యాటలకు వస్తుంటే చూస్తూ తట్టుకోలేక పాకిస్తానీయులు ఉగ్రవాదులతో దాడులు చేయించిందన్నారు. భారతీయులంతా పార్టీలకు అతీతంగా దేశం కోసం భద్రత, రక్షణ కోసం ఉగ్రదాడులను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల వ్యయ ప్రయాసాలు తగ్గి అభివృద్ధిపై దృష్టిసారించే ఆస్కారం ఉంటుందన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టం వల్ల పేద ముస్లింలకు ఎంతో లాభం కలగనుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మేధావులు ఉమ్మెంతల మహేశ్వర్, జగ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారానే ఉద్యోగ భద్రత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అధ్యాపకులు ఉద్యమించడం ద్వారా ఉద్యోగ భద్రత సాధ్యపడుతుందని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవాచారి పేర్కొన్నారు. పీయూలో కొన్ని రోజులుగా కాంట్రాక్టు అధ్యాపకులు చేస్తున్న సమ్మెకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపి, మాట్లాడారు. అధ్యాపకులు మరింత ఉత్సాహంగా ఉద్యమం చేయాలని, వారికి పౌర సమాజం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఉన్నతవిద్యలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు సమాజానికి మార్గదర్శకులుగా పనిచేస్తున్నారని, అలాంటి వారు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని టెంట్ కింద కూర్చోవడం సభ్య సమాజానికి తలవంపులు తెస్తుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుందని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తమవంతు సహకారం ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు వద్దు

నారాయణపేట: జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టవద్దని, ఒకవేళ అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల భద్రతకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని షేర్ చేసిన చర్యలు తప్పవని తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫొటోలు పోస్టులు చేసిన, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయని పేర్కొన్నారు. పోలీసులు 24/7 సోషల్ మీడియా యాప్‌లు, పోస్టులు పరిశీలిస్తుంటారని, ఏ పోస్టులు అయినా ఫార్వర్డ్ చేసే ముందు గమనించాలని సూచించారు.

అడిషనల్ కలెక్టర్‌కు డీడబ్ల్యూఓ బాధ్యతలు

నారాయణపేట: డీడబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న జయను బాధ్యతల నుంచి తప్పించి డీడబ్ల్యూఓ బాధ్యతలను అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు అప్పగించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కీలకం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో కీలకం అని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్స్ ప్రతి ఒక్క విభాగంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అందుకోసం విద్యార్థులు పూర్తిస్థాయిలో కంప్యూటర్ విద్యపై దృష్టిసారించాలన్నారు. వీటిద్వారా అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు సైతం స్కిల్స్ ఉన్న విద్యార్థులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, పరిశోధన కోణం ఆలోచించే వారికి సృజనాత్మకత ఉండడం వల్ల వారు త్వరగా ఉద్యోగాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా అధికారులు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఎస్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఆర్జేడీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పెసర క్వింటాల్ రూ.7,477

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పెసర గరిష్టం, కనిష్టంగా రూ.7,477 ధర పలికింది. అలాగే, జొన్నలు గరిష్టంగా రూ.3,926, కనిష్టంగా రూ.3,505, అలసందలు గరిష్టంగా రూ.6,305, కనిష్టంగా రూ.6,055, వడ్లు హంస గరిష్టంగా రూ.1,756, కనిష్టంగా రూ.1,525, వడ్లు సోనా గరిష్టంగా రూ.2.220, కనిష్టంగా రూ.1,350, కందులు ఎర్రవి గరిష్ట, కనిష్టంగా రూ.6,869 ధర పలికాయి.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,275

జడ్చర్ల/ దేవరకద్ర: పట్టణంలోని బాదేపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,275, కనిష్టంగా రూ.1,402 ధరలు లభించాయి. అలాగే వేరుశనగ గరిష్టంగా రూ.5,913, కనిష్టంగా రూ.4,041, ఆముదాలు గరిష్టంగా రూ.6,137, కనిష్టంగా రూ.6,100, జొన్నలు సరాసరిగా రూ.1,817, ధాన్యం హంస గరిష్టంగా రూ.2,011, కనిష్టంగా రూ.1,809, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,359, కనిష్టంగా రూ.1,809, రాగులు రూ.2,157 చొప్పున పలికాయి.

ఆర్ఎన్ఆర్ ధర రూ.2,236

దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,236, కనిష్టంగా రూ.1,809 ధరలు లభించాయి. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,749, కనిష్టంగా రూ.1,629, ఆముదాలు గరిష్టంగా రూ.6,006 వచ్చాయి. సీజన్ కావడంతో మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

నేడు మార్కెట్ బంద్

ఉగ్రదాడులను నిరసిస్తూ బాదేపల్లి మార్కెట్ వ్యాపార సంఘం ఆధ్వర్యంలో శనివారం క్రయవిక్రయాలను నిర్వహించడంలేదు.

సంగమేశ్వరా.. దారి చూపవా..

- కృష్ణాతీరంలోని సంగమేశ్వరుని దర్శనానికి సరిహద్దు పంచాయితీ
- ఏపీ పరిధిలోని ఆలయం చెంతకు తెలంగాణ బోట్లను రానివ్వకుండా అడ్డుపడుతున్న ఏపీ జాలర్లు
- స్వామి దర్శనానికి వ్యయ ప్రయాసలతో కష్టాలు పడుతున్న భక్తులు
- ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే సంగమేశ్వరుడి దర్శనం



కృష్ణాతీరంలోని సంగమేశ్వరుడి ఆలయం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే ఆలయం తెరచుకుని ఉంటుంది. మిగతా కాలమంతా నీటిలోనే మునిగి ఉంటుంది. ఏడు నదులు ఒక చోట కలిసే సంగమేశ్వర క్షేత్రంలో స్వామిని దర్శనం చేసుకునేందుకు భక్తులకు ప్రయాసలు తప్పడం లేదు. కృష్ణాతీరానికి ఇరువైపులా ఉన్న స్థానిక గ్రామాల జాలర్లు, బోట్ల నిర్వాహకుల మధ్య వివాదం, ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య సరిహద్దు పంచాయితీని తీసుకువచ్చింది. ఫలితంగా సంగమేశ్వరుడి దర్శనం కోసం వస్తున్న భక్తులు, పర్యాటకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇరు రాష్ట్రాల జాలర్ల మధ్య సరిహద్దు వివాదం..

సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు నాగర్‌కర్నూల్ జిల్లాలోని కృష్ణాతీరంలో ఉన్న సోమశిలకు చేరుకుంటారు. అక్కడి నుంచి బోటులో సంగమేశ్వర ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే ఆలయం ఏపీ పరిధిలో ఉండటంతో సంగమేశ్వరం, సిద్దేశ్వరం గ్రామాలకు చెందిన జాలర్లు, బోట్ల నిర్వహకులు తెలంగాణ నుంచి వచ్చే బోట్లను అడ్డుకుంటున్నారు. తమకు ఆదాయం రావడం లేదని అభ్యంతరం చెబుతుండటంతో తరచుగా వివాదం చెలరేగుతోంది. దీంతో కొన్ని రోజులుగా సంగమేశ్వర దర్శనం కోసం వస్తున్న భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మొదట తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి బోటులో బయలుదేరితే ఏపీ పరిధిలోని సిద్దేశ్వరం తీరం వద్ద బోటును నిలిపివేస్తున్నారు. అక్కడి నుంచి 3 కి.మీ. దూరంలోని సంగమేశ్వరం వరకు ఆటోలో ప్రయాణించి ఆలయాన్ని చేరుకుంటున్నారు. దర్శనం తర్వాత ఆటోలో సిద్దేశ్వరం వరకు వచ్చి, అక్కడి కృష్ణానదిలో ఏపీకి చెందిన జాలర్ల బోట్లలో సోమశిలకు చేరుకోవాల్సి వస్తోంది. ఇందు కోసం ఒక్కో చోట రూ.వంద చొప్పున.. ఒక్కొక్కరికి మొత్తం రూ.300 ఖర్చు అవుతుంది. బోటు నుంచి ఆటో, ఆటో నుంచి మళ్లీ బోటుకు మారి ప్రయాణించేందుకు కనీసం 2 నుంచి 3 గంటల సమయం పడుతోంది. ఇరు రాష్ట్రాల జాలర్ల సరిహద్దు వివాదంతో పర్యాటకులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సప్త నదుల సంగమం, ఏడాదిలో నాలుగు నెలలే దర్శనం..

కృష్ణానది ఒడ్డున ఉన్న సంగమేశ్వర ఆలయం శ్రీశైలం రిజర్వాయర్ నిర్మాణ సమయంలో బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తపల్లి మండల పరిధిలో ఉన్న సంగమేశ్వర ఆలయం ప్రతి ఏటా వేసవిలో శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గాక ఆలయం కనిపిస్తుంది. మార్చి నుంచి జూన్ వరకు రిజర్వాయర్‌లో నీరు లేని సమయంలోని భక్తుల దర్శనానికి అందుబాటులో ఉంటుంది. మిగతా ఏడాదంతా నీటిలోనే మునిగి ఉంటుంది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహారిణి, భీమారథి, భవనాశిని నదులు ప్రవహించే ఏడు నదుల సంగమ క్షేత్రంగా సంగమేశ్వరాన్ని పేర్కొంటారు. ఆలయంలో శివలింగాన్ని పాండవుల్లో ఒకరైన భీముడు రాయితో కాకుండా వేపధారు(చెక్క)తో ప్రతిష్ఠించడం ఇక్కడి ప్రత్యేకత.

పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు..



సోమశిల వద్ద కృష్ణాతీరం వద్దకు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. సంగమేశ్వరుడి దర్శనం కోసం కృష్ణానదిలో బోటులో వెళ్లాల్సి ఉండగా, ఏపీకి చెందిన సిద్దేశ్వరం, సంగమేశ్వర గ్రామాల జాలర్లు బోట్లను రానివ్వడం లేదు. కొద్ది దూరం బోటులో, తర్వాత ఆటోలో, మళ్లీ బోటులో ప్రయాణిస్తూ కష్టాలు పడుతున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– రామ్మోహన్, సోమశిల, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా



సోమశిల వద్ద బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు

క్లుప్తంగా

ట్రాక్టర్ పైనుంచి పడి మహిళ మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలం లత్తిపురం గ్రామానికి చెందిన పావని(30) భర్తతో కలిసి గురువారం సాయంత్రం వెంకటోనిపల్లి గ్రామం నుంచి ట్రాక్టర్‌పై కంకర నింపుకుని స్వగ్రామానికి వస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా కారణంగా మార్గమధ్యలో జమ్మిచెడ్ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పావని ట్రాలీ డోర్ కిందపడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. భర్త శంకర్ శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

18 ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఖిల్లాఘనపురం: అనుమతులు లేకుండా ప్రభుత్వ ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుక నింపుతున్న 18 ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కమాలోద్దీన్‌పూర్ గ్రామ పంచాయతీలోని కొత్తపల్లె సమీపంలోని ప్రభుత్వ ఇసుక రీచ్‌లో గ్రామస్తులు ఫిర్యాదు మేరకు శుక్రవారం తహసీల్దార్ సుగుణ ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీలో ఇసుక నింపుకుంటున్న 19 ట్రాక్టర్లలో కేవలం ఒక్క ట్రాక్టర్‌కు మాత్రమే అనుమతి ఉండటంతో మిగిలిన 18 ట్రాక్టర్లను ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐకు పిర్యాదు చేయడంతో 18 ట్రాక్టర్లు, యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ సురేష్ గౌడ్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదుట శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం లభించింది. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఘరానా దొంగ అరెస్ట్ : 5 బైక్‌లు స్వాధీనం

గద్వాల క్రైం: తప్పించుకు తిరుగుతున్న ఘరానా దొంగను ఏట్టకేలకు అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రానికి చెందిన వంశీ, మరో ఏడుగురు యువకులు కలిసి ఉమ్మడి జిల్లాలో ద్విచక్ర వాహనాలను దొంగిలించేవారు. 2024, డిసెంబర్ 2న ముఠాలోని ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 35 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు వంశీ కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం ధరూర్ మెట్ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా పట్టణ శివారులో మరో అయిదు ద్విచక్ర వాహనాలను దాచినట్లు చెప్పడంతో వాటిని స్వాధీనం చేసుకొని వంశీని గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. వంశీపై ఇప్పటికే పలు దొంగతనాల కేసులు నమోదయ్యాయని.. అతడిని పట్టుకునేందుకు సాంకేతిక నిపుణులు చంద్రయ్య, శాంతికిరణ్ సహకరించినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టు సమక్షంలో బాధితులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ వివరించారు.

'ఆర్డీఎస్ రైతులపై కోపమెందుకు..'

అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు రైతులపై ఎంపీ మల్లు రవికి కోపమెందుకో చెప్పాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని రైతులు కోరుతుంటే, ఎంపీ మాత్రం మల్లమ్మ కుంట రిజర్వాయర్‌ను రద్దు చేయాలని కలెక్టర్ ఎంబీ సంతోష్‌కి లేఖ రాశారన్నారు. కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈకి లేఖ రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని ఆరోపించారు. ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలంటే సింధనూరు గ్రామ సమీపంలోని డిస్ట్రిబ్యూటర్ 12 వద్ద ఆర్డీఎస్ కాలువకు లింక్ కలపాలన్నారు. అదే విధంగా వేముల వద్ద జూరాల నీటిని కలిపి మల్లమ్మ కుంట రిజర్వాయర్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భీమసేన రావు, గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, అశోక్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

- సాక్షిప్రతినిధి, వరంగల్



జోన్‌-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్ : మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్‌-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్ : ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్‌-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్–దేవునూరు – దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్‌-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్– కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్‌-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట– ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక



సభ వివరాలు

మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు

సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు



చందుబట్లలో పంట నష్టపోయిన రైతుల పొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ కేవీఎన్‌రెడ్డి అన్నారు. క్రిమిసంహారక మందు వినియోగించి నష్టపోయిన మండలంలోని చందుబట్ల, నర్సాయిపల్లి గ్రామాల్లోని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి రైతుల వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు, పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులకు నష్టం కల్గించే ఏజెన్సీలపై సహించేది లేదని హెచ్చరించారు. భూత్పూరు, ములుగు ప్రాంతాల్లో నకిలీ మందులు, విత్తనాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో నివేదికలు తెప్పించుకుని పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని కెవీఎన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

కోస్గి రూరల్: మైనర్‌ను అపహరించి అత్యాచారం చేసిన ఘటనలో ఓ వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ బాల్‌రాజ్ వివరాల ప్రకారం దోమ మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన రమేష్ కోస్గి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ను అపహరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చాగా ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ మమతరెడ్డి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితుడిని జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సహాయక చర్యలకు బ్రేక్



సొరంగం లోపల సహాయక చర్యలు

- నేటితో ముగియనున్న మట్టి, రాళ్లు, టీబీఎం శకలాల తరలింపు
- తాత్కాలికంగా నిలిపివేయాలని భావిస్తున్న ప్రభుత్వం
- వెనుదిరుగుతున్న ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, ర్యాట్‌హోల్ మైనర్స్ బృందాలు
- ఉప కమిటీ నివేదిక ఆధారంగా ముందుకు..

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో శుక్రవారం 63వ రోజు సహాయక చర్యలు కొనసాగాయి. మట్టి, రాళ్లు, టీబీఎం శకలాల తరలింపు దాదాపుగా దగ్గర పడటంలో సహాయక బృందాలు కూడా వెనుదిరుగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు తిరుగుముఖం పట్టగా.. ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్, రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు శుక్రవారం సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. నిషేధిత 43 మీటర్ల ప్రదేశం మినహా డీ2, డీ1 మధ్య మట్టి, బురద, బండరాళ్లు, టీబీఎం శకలాల తొలగింపు దాదాపు పూర్తి కావచ్చింది. సొరంగం పైకప్పు కూలిన ఘటనలో చిక్కుకున్న ఎనిమిది మందిలో ఇద్దరి మృతదేహాలు లభించగా.. ఆరుగురి జాడ నేటికీ లభించలేదు. చివరి 43 మీటర్లు అత్యంత ప్రమాదకరమని, సహాయక చర్యలు కొనసాగిస్తే మళ్లీ పైకప్పు కూలవచ్చని నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు, జీఎస్ఐ నిపుణుల కమిటీ సూచనల మేరకు ప్రభుత్వం సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేసేందుకే నిర్ణయం తీసుకుంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ నిపుణలతో సబ్‌కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని.. సైట్ స్పెసిఫిక్ రిపోర్టు తయారు చేయాలని కోరింది. ఈ కమిటీ నివేధిక ఆధారంగా సహాయక చర్యల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకోనున్నారు. నివేదిక తయారీకి మూడు నెలలకు పైగా సమయం పట్టవచ్చని భావిస్తున్నారు.

బైపాస్ మార్గం..

దోమలపెంట ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ నుంచి బైపాస్ మార్గంలో సొరంగం తవ్వకాలు చేపట్టాలని గురువారం సమావేశమైన టెక్నికల్ కమిటీ సిఫారస్ చేసింది. సొరంగం పైకప్పు కూలిన 13.936 కిలోమీటరు వద్ద 43 మీటర్ల వరకు నిషేధిత ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. కంచె ముందు నుంచి బైపాస్ మార్గం ఏర్పాటుకు అడ్డంగా ఉన్న టీబీఎం ప్లాట్ ఫ్లామ్ భాగాలను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది థర్మల్ గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోకో ట్రైన్‌లో.. ఉబికి వస్తున్న నీటి ఊటను భారీ మోటార్ల సాయంతో కృష్ణానదిలోకి.. మట్టి, బురదను కన్వేయర్ బెల్టుపై సొరంగం బయటకు తరలిస్తున్నారు. తవ్వకాలు నిలిపివేసి టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)కు బదులుగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరపడం శ్రేయస్కరమని టెక్నికల్ కమిటీ నిర్ణయించింది. ఇదే సమయంలో మన్నెవారిపల్లి సొరంగం ఔట్‌లెట్ నుంచి టీబీఎం ద్వారా తవ్వకాలు త్వరగా ప్రారంభించాలని భావిస్తున్నారు.

గన్నీ బ్యాగుల కోసం రైతుల రాస్తారోకో



అప్పాయిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

- గంటపాటు జాతీయ రహదారి నిర్బంధం
- రైతుల ఆందోళనకు దిగివచ్చిన అధికారులు
- అప్పటికప్పుడు 18 వేల బ్యాగులు పీఏసీఎస్‌కు సరఫరా

మహబూబ్‌నగర్ రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గన్నీ బ్యాగుల కొరత ఏర్పడడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. గత వానాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నామమాత్రంగా ధాన్యం విక్రయాలు జరగడంతో ఆ విధంగానే ఈ యాసంగిలోనూ కూడా ఉంటాయని భావించిన అధికారులు కేంద్రాలకు కొంత మొత్తంలోనే గన్నీ బ్యాగులను సరఫరా చేశారు. అయితే గతేడాది వ్యాపారులకు నేరుగా ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందించే రూ.500 బోనస్ కోల్పోయిన రైతులు ఈసారి బోనస్ పొందాలనే ఉద్దేశంతో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఊహించని రీతిలో రైతులు ధాన్యాన్ని విక్రయాలకు తీసుకు రావడంతో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. అకాల వర్షాలు వెంటాడుతుండటంతో పండించిన ధాన్యాన్ని త్వరగా విక్రయించాలని చూస్తున్న రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు పోటీ పడుతున్నారు. దాంతో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. శుక్రవారం కోటకదిర వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కొనుగోలు కేంద్రానికి గన్నీ బ్యాగుల కోసం పెద్దఎత్తున రైతులు తరలివచ్చారు. వారికి అవసరమైన గన్నీ బ్యాగులు లభించకపోవడంతో రైతులు హైదరాబాద్- రాయచూర్ జాతీయ ప్రధాన రహదారి పైకి వచ్చి పెద్దఎత్తున ఆందోళన చేశారు. దాదాపు గంటపాటు రైతులు రాస్తారోకో చేయడంతో జాతీయ రహదారికి ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎస్సై విజయ్‌కుమార్‌లు హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులతో చర్చించి వెంటనే 18 వేల గన్నీ బ్యాగులను తెప్పించారు. దీంతో రైతులు శాంతించారు.

హజ్‌లో ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలి



హజ్‌యాత్రికులను సన్మానించిన కమిటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర యాజ్‌యాత్రలో జిల్లా క్షేమం కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం మౌలానా సఫీర్ అహ్మద్ నక్షబంది అన్నారు. జిల్లా కేంద్రంలోని జామీయ మసీద్‌లో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్‌యాత్రికులను ఘనంగా సన్మానించారు. మహెరుమాలు, పూలమాలలతో సత్కరించారు. మౌలానా సఫీర్ అహ్మద్ మాట్లాడుతూ పవిత్ర హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ అమీనుద్దీన్, సమద్‌ఖాన్, కార్యదర్శి మహ్మద్ జకీ, ఇసాక్, మహ్మద్ కలీం, సయ్యద్ సుల్తాన్, తన్వీర్, జఫర్, జహంగీర్‌పాష ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

పరికరాల శుభ్రంతో.. బిందు సేద్యం సులభం

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: బిందు సేద్యం పరికరాలను సకాలంలో శుభ్రం చేసుకోవడం వలన పరికరాల మన్నికతోపాటు నీటి పారుదల బాగుంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు. వంద అడుగులకుపైగా పడిపోయిన భూగర్భ జలాల నుంచి వచ్చే సన్నటి మన్ను ఎరువులు బిందు సేద్యం పరికరాలను దెబ్బతిస్తాయి. తద్వారా మోటార్లపై భారం పడి అవి దెబ్బతినే అవకాశం ఉంటుంది. పరికరాలను భద్రపర్చడానికి బిందు సేద్య పరికరాలను శుభ్రపర్చుకోవడానికి పలు సూచనలు రైతులకు వివరించారు.

స్క్రీన్ ఫిల్టర్ శుభ్రత కీలకం

బోరు బావుల నుంచి వచ్చే నీటితో సన్నటి మన్ను అధికంగా వస్తోంది. దీని వలన లేటర్ పైప్‌ల నుంచి నీరు వచ్చే మార్గాలు మూసుకుపోతాయి. దీని నివారణకు బోరు వద్ద నుంచి లేటరల్ పైపులకు నీరు వచ్చే ముందు స్క్రీన్ ఫిల్టర్ అమర్చుతారు. దీన్ని వారం రోజులకు ఒకసారి నీటితో శుభ్రపర్చుకోవాలి. ఫిల్టర్‌పై సన్నటి రంధ్రాలు పూడిపోకుండా చూసుకోవాలి. కొత్తగా వేసిన బోర్లు అయితే రోజుకు ఒక పర్యంతమైనా ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవడం మంచిది. బావుల నుంచి నీటిని తీసుకుంటున్నప్పుడు సాండ్ ఫిల్టర్‌ను అమర్చుకోవాలి. రెండు ఫిల్టర్లతో రెండు దఫాలుగా వడపోత జరిగి లేటరల్ పైపుల్లోకి మట్టి చేరకుండా ఉంటుంది.

లెటరల్ పైపులకు యాసిడ్ ట్రీట్‌మెంట్

బిందు సేద్య పరికరాల ద్వారా అందించే ఎరువులు వల్ల లేటరల్ పైపులకున్న రంధ్రాలు పూడుకుపోయి.. నీరు కిందికి రావడం నిలిచిపోయి మొక్కలకు అందదు. ఏడాదికి ఒకసారి పైప్‌లను శుభ్రపర్చుకోవాలి. ఇందుకోసం తక్కువ గాఢత గల హైడ్రోక్లోరిక్ లేదా సల్ఫ్యూరిక్ యాసిడ్ వాడతారు. యాసిడ్ ఉపయోగించి పైప్‌లను శుభ్రపరిచేందుకు రెండు పద్ధతులను పాటించవచ్చు. పంట లేని సమయంలో లేటరల్ పైప్‌లను శుభ్రపర్చుకోవాలి. ఎకరా పొలంలో గల లేటరల్ పైప్‌లను శుభ్రపరిచేందుకు 30 - 40 లీటర్ల హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను కొనుగోలు చేసుకోవాలి. 10 మీ., హౌస్ పైప్‌ను యు ఆకారంలో ఉండేలా అమర్చుకోవాలి. ఇందుకోసం రెండు వైపుల కట్టెలను పాతి వాటికి హౌస్ పైప్ కట్టి.. పైప్‌ను యాసిడ్‌ను ఉంచాలి. గాఢత తక్కువ గల యాసిడ్‌ను మాత్రమే మార్కెట్‌లో విక్రయిస్తారు.

❒ రెండో పద్ధతిలో ఎరువులను వదిలే ప్లాస్టిక్ ఫెర్టిగేషన్ ట్యాంకు ద్వారా శుభ్రపర్చాలి. పంట లేని సమయంలో మాత్రమే ఈ పద్ధతి అవలంభించాలి. ప్లాస్టిక్ ఫెర్టిగేషన్ ట్యాంక్‌ను ముందుగా శుభ్రపర్చుకోవాలి. ఆపై తక్కువ గాఢత గల యాసిడ్‌ను నింపి నీటిని అందులోకి పంపాలి. ఈ ప్రక్రియ మెల్లగా జరిగేలా చూడాలి. ఇనుప ఫెర్టిగేషన్ ట్యాంక్ ఉన్నట్లయితే వెంచురీ సహాయంతో లేటరల్ పైప్‌లను శుభ్రం చేసుకోవడం ఉత్తమం.





ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

❒ పంట ఉన్న సమయాల్లో యాసిడ్ ద్వారా పైప్‌లను శుభ్రపర్చరాదు.

❒ డ్రిప్ కంపెనీలు సూచించిన యాసిడ్‌ను వారు నిర్దేశించిన మోతాదులోనే వాడాలి.

❒ నీటిలో యాసిడ్ కలపాలి. అంతేకాని యాసిడ్ ఉన్న బ్యాంకులో నీటిని ధారపోసే ప్రయత్నం చేయరాదు.

❒ ఫెర్టిగేషన్ లేదా వెంచురీ సహాయంతో యాసిడ్‌ను పంపేటప్పుడు నీటిని వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

❒ పైపులు శుభ్రపడిన అనంతరం ఎండ్ క్యాప్‌లను తీసేసి యాసిడ్ కలిపిన నీటిని వదిలేయాలి.

❒ శుభ్రపరిచిన పైప్‌లను సైతం మరోమారు నీటితో కడగడం లేదా సబ్‌లైన్‌కు బిగించి నీటిని పారనివ్వాలి.


❒ శుభ్రపరిచే సమయాల్లో రైతులు ముఖానికి, చేతులకు తొడుగులు ధరించాలి. వీలైతే చలువ కంటి అద్దాలు పెట్టుకోవడం ఉత్తమం.

విద్యార్థిని కొట్టిన హాస్టల్ వార్డెన్

- పోలీసులకు ఫిర్యాదు

నవాబుపేట: ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని హాస్టల్ వార్డెన్ కట్టెతో కొట్టిన విషయంలో కేసు నమోదైన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని చిన్నమేగ్యతండా పంచాయతీ గోప్యానాయక్ తండాకు చెందిన వినోద్ కొత్తపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 18న హాస్టల్ వార్డెన్ చేతిపై కట్టెతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విద్యా సంవత్సరం ముగింపు ఉండటం, విద్యార్థి బయటికి రాలేకపోయాడు. చివరికి ఈనెల 22న ఇంటికి చేరుకుని తండ్రి భాస్కర్‌నాయక్‌కు హాస్టల్ వార్డెన్ బాలచందర్ కట్టెతో తీవ్రంగా గాయపరచిన విషయాన్ని వివరించాడు. భాస్కర్‌నాయక్ విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పించి శుక్రవారం హాస్టల్ వార్డెన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భాస్కర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కొట్టిన వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

పశువుల పాక దగ్ధం



చారకొండ: మండల కేంద్రంలో జెల్ల గురువయ్య గౌడ్‌కు చెందిన పశువుల పాక ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం పశువుల కొట్టంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న రైతులు పశువులను కాపాడారు. దాదాపగా రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్ల గ్రామస్తులు తెలిపారు.

కంటికి ఆహారం... వ్యాయామం

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్లు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి... పదును పెట్టండి



వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒక సారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహద పడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్‌లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.





టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు.. ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్‌లుగా మార్చుకోండి,

కావలసినవి: రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.

బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాపల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కొల్లేజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.



సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు.

కావలసినవి: పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్లు.

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.



పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో 'రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్'ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి, వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

లైఫ్@360

● యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణామాయ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.

భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

సాక్షి సినిమా

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెర పైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మౌంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!

- సమంత

"**జీ**వితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి" అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను" అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ– "నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను" అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

తన కోసమే నా పొగరే అణిగేనా...



● నాని

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. "'హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

"శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ– "ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం" అని చెప్పారు. "మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది" అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. "చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది" అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

"**క**లియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి" అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. "సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం" అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ | ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేతలందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉర్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ సట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మామూలు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్



– హరికృష్ణ ఇంటూరు